సాక్షి రంగారెడ్డి

గురువారం । 22 । మే । 2025



ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి సబితారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸



ఆధునిక పద్ధతుల్లో..

పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులు మార్చుకోవాలని ఏఎస్‌పీడీ రమేశ్ సూచించారు. 8లో▸



సైకిళ్ల అందజేత

లయన్స్ క్లబ్ సౌజన్యంతో దెబ్బడగూడకు చెందిన పేద విద్యార్థినులకు ఈ–సైకిళ్లు అందజేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఏపీఎంపై డీఆర్‌డీఓకు ఫిర్యాదు

నందిగామ: నందిగామ మండల మహిళా సమాఖ్యలో ఏపీఎంగా పనిచేస్తున్న యాదగిరి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీసీ యాదయ్య జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వీర్లపల్లి సంఘంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా రూ.3 లక్షలు చెక్కురూపంలో నిధులను మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే క్లస్టర్‌లో సీసీగా పనిచేస్తున్న తనకు ఈ విషయం తెలియడంతో ఏపీఓను ప్రశ్నించగా తననే దూషించారన్నారు. ఈ విషయమై డీఆర్‌డీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఏపీఎం యాదగిరిని వివరణ కోరగా.. అందులో తన ప్రమేయం లేదని, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, నిజానిజాలు విచారణలో తేలుతాయని స్పష్టంచేశారు.

ఇబ్రహీంపట్నం ఎస్‌ఐపై వేటు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై వేటు పడింది. ఆయనను మల్టీజోన్ రేంజ్ ఆఫీస్‌కు సరెండర్ చేస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో మంచాల ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ ఓ యాక్సిడెంట్ కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణలపై, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితమే ఆయన ఇబ్రహీంపట్నం పీఎస్ నుంచి రిలీవ్ అయినట్లు సమాచారం.

కడ్తాల్ ఎస్‌ఐకి ఉత్తమ పోలీసు అధికారి అవార్డు



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ వరప్రసాద్

కడ్తాల్: నేర పరిశోధన విభాగం 2024 సంవత్సరానికి సంబంధించి, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కడ్తాల్ ఎస్‌ఐ వరప్రసాద్ ఉత్తమ పోలీస్ అధికారిగా అవార్డు అందుకున్నారు. పీఎస్ పరిధిలో నమోదైన పలు కేసులను వేగంగా దర్యాప్తు చేయడంతోపాటు ఉత్తమ సేవలకు గానూ బుధవారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బెస్ట్ ఎస్‌ఐ వరప్రసాద్‌తో పాటు బెస్ట్ హోంగార్డుగా అవార్డు తీసుకున్న పాండును సీఐ గంగాధర్, పోలీసులు అభినందించారు.

ప్రేమ పేరుతో మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరుకు చెందిన దుబ్బాక సాగరిక ఆదిబట్ల టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. 2022లో కోల్‌కటా టీసీఎస్‌లో పని చేసిన సమయంలో సహోద్యోగి పత్లావత్ సంజీవతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం వీరిద్దరూ ఆదిబట్ల టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూ సహజీవనంలో ఉన్నారు. ఈక్రమంలో సాగరిక గర్భం దాల్చింది. దీంతో సంజీవ ఆమెకు బలవంతంగా అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో మొహం చాటేశాడు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, బుధవారం అతన్ని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సాగరికకు అబార్షన్ చేసిన తుర్కయంజాల్‌లోని మహోనియా ఆస్పత్రి యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జనావాసాల్లోకి వచ్చి..

గేటులో తల ఇరుక్కుని



గేటులో చిక్కుకుపోయిన జింక

కుల్కచర్ల: జనావాసాల్లోకి వచ్చిన ఓ జింక ప్రహరీకి ఏర్పాటు చేసిన గేటులో తల ఇరుక్కుపోయి ప్రజలకు చిక్కింది. ఈ ఘటన చౌడాపూర్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మన్‌కాల్వ అటవీ ప్రాంతం నుంచి సాయంత్రం ఓ జింక మరికల్ సమీపంలోని రామాలయం వద్దకు వచ్చింది. అక్కడ ఓ వ్యక్తి తన స్థలానికి ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశాడు. అందులో జింక తల పెట్టి చిక్కుకుపోయింది. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని గేటుకు ఉన్న ఇనుప చువ్వలను తొలగించి జింకను మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి పార్కుకు తరలించామని బీట్ ఆఫీసర్ ఆంజనేయులు తెలిపారు.

వరుణుడి.. జలజడి

భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి కురిసిన వానలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు వరద దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లాయి. దీంతో దైనందిన కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం
- జల దిగ్బంధంలో రహదారులు
- పొంగిపొర్లిన వాగులు, కాలువలు



ఉత్తరాసిపల్లి వద్ద నిలిచిపోయిన రాకపోకలు

వాగు పొంగడంతో ఆగిన బస్సు

కొందుర్గు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ముట్పూర్, ఉత్తరాసిపల్లి, చుక్కమెట్టు తదితర గ్రామాల్లో వరద ప్రవాహం పోటెత్తింది. రామచంద్రాపూర్ నుంచి రేగడిచిల్కమర్రి రోడ్డులో వాహనాల రాకపోకలు గంటకు పైనే నిలిచిపోయాయి. రేగడిచిల్కమర్రి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు వాగు పొంగడంతో ఉత్తరాసిపల్లి వద్ద ప్రయాణికులను వదిలేసి షాద్‌నగర్‌కు తిరిగి వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికులు వరద ఉధృతి తగ్గేవరకు అక్కడే వేచి ఉన్నారు.



ఉత్తరాసిపల్లి రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు



హిమాయత్‌నగర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

విరిగిన చెట్ల కొమ్మలు

మొయినాబాద్: అకాల వర్షం ఆగమాగం చేసింది. మొయినాబాద్ మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షపు నీరు నిలిచింది. మున్సిపల్ కేంద్రంతోపాటు అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, గండిపేట చౌరస్తా, కనకమామిడి గేటు సమీపంలో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బలమైన ఈదురుగాలులకు ముర్తుజాగూడలో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడ్డాయి. సుమారు నాలుగు గంటలపాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

❖ వరదలో వాహనాలు



ఉడిపి హోటల్ ఎదుట వరద నీటిలో నిలిచిన వాహనాలు



పైపులైన్ పగిలి ఫౌంటెన్‌లా చిమ్ముతున్న నీరు

మొయినాబాద్‌రూరల్: అకాలంగా భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులు వరద నీటితో నిండుకుండలను తలపించాయి. హైదరాబాద్–బీజాపూర్ రహదారి హిమాయత్‌నగర్ పరిధిలోని గండిపేట చౌరస్తా మసీదు వద్ద విద్యాజ్యోతి కళాశాల ముందు, ఎన్కెపల్లి చౌరస్తా సమీపంలో, హిమాయత్‌నగర్ చౌరస్తా ఉడిపి హోటల్ ముందు వరద నీరు భారీగా చేరడంతో వాహనాదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో కల్వర్టు పైపులైన్ పగిలి రహదారి జలమయంగా మారింది. దీంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



మామిడిపల్లిలో కురుస్తున్న వర్షం

రాకపోకలకు ఇబ్బంది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. జల్‌పల్లి నుంచి మామిడిపల్లికి వెళ్లే రూట్‌లోని కార్గో రోడ్డు, షాహిన్‌నగర్, ఎర్రకుంట రహదారులపై ఎక్కడపడితే అక్కడ వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. భానుడి భగభగలతో అల్లాడిపోయిన జనాలు ఈ భారీ వర్షంతో ఊరట చెందారు. అక్కడక్కడ చిన్నారులు వర్షంలో కేరింతలు కొడుతూ ఆటలాడారు.

❖ చల్లబడిన వాతావరణం

ఇబ్రహీంపట్నం: మండలంలో వాతావరణం మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది. వేసవిలో భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది. మండలంలో సరాసరిగా 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దండుమైలారంలో 54.8 మి.మీ, ఎలిమినేడులో 38.5 మి.మీ, ఇబ్రహీంపట్నంలో 19.8 మి.మీ నమోదయింది.



నిండు కుండలా పారుతున్న బొబ్బిలిగామ వాగు

❖ నిండుగా బొబ్బిలిగామ వాగు

షాబాద్: మండలంలో కురిసిన వర్షానికి బొబ్బిలిగామ వాగు నిండుగా పారుతుంది. దీంతో ప్రజలకు రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని గ్రామాల సరిహద్దు నుంచి వెళ్లే ఈ వాగులోకి నీళ్లు రావడంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది.

కుంట్లూర్ కంటతడి

- ముగ్గురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు
- రోడ్డు ప్రమాద స్థలంలో భారీగా ట్రాఫిక్ జామ్
- బాధితులను పరామర్శించిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారని తెలుసుకున్న స్థానికులు పెద్దఎత్తున ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కుంట్లూరు–పసుమాముల రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సీఐలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోస్టుమార్టం అనంతరం ఒకేసారి మూడు మృతదేహాలు కుంట్లూర్‌కు రావడంతో బంధువులు, స్థానికులు, మృతుల స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకేసారి ముగ్గురికి అంత్యక్రియలు జరపడంతో వందల సంఖ్యలో ప్రజలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

నేతల పరామర్శ..

యువకుల మృతి సమాచారం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు మృతుల కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ఎవరికీ లంచాలివ్వొద్దు



ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

- ఇబ్బంది పెడితే నేరుగా ఫోన్ చేయండి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎవరికీ లంచాలు ఇవ్వొద్దని.. ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా తనకు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పథకం లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. పేదోల్లంతా మనోల్లే.. ఆ పార్టీ, ఈ పార్టీ అనే తారతమ్యాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. ఇళ్లు మంజూరైన వారు మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. బేస్మెట్ పూర్తవగానే రూ.లక్ష, గోడలు కట్టిన తర్వాత మరో రూ.లక్ష, స్లాబ్ వేశాక రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తవగానే మరో రూ.లక్ష ఇలా నాలుగు విడతల్లో బిల్లులు వస్తాయని వివరించారు. కొలతలు, ఇంటి నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు.

హామీలను నెరవేరుస్తున్నాం..

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఎమ్మెల్యే మండిపడ్డారు. అయినప్పటికీ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను నెరవేరుస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల కాలంలో నియోజకవర్గం వ్యాప్తంగా 20 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చాంప్లానాయక్, ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

బోధన మారాలి

- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పనితీరును మెరుగుపర్చుకోవాలి
- ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో డీఈఓ సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విద్యను జోడించి బోధన చేయాలని, ఇందుకోసం పనితీరును మెరుగుపర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక గురుకుల విద్యాపీఠంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం శిబిరాన్ని సందర్శించిన డీఈఓ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన విధానాలు మారాలని తెలిపారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అవసరమన్నారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలే సర్కారు బడులకు వస్తారని, వీరికి తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత మీపైనే ఉందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధన ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలన్నారు.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టాలి..

రోజురోజుకు పెరిగిపోతున్న డ్రగ్స్ భూతాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని డీఈఓ పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయి నుంచి డ్రగ్స్‌ను నిరోధించేందుకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వీటికి బానిసలైన ఎంతో మంది విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ హీర్యానాయక్, యాచారం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, డీఆర్పీ పరమేశ్, నర్సింహ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

నేరాల నియంత్రణకే కొత్త ఠాణాలు: సీపీ ఆనంద్



దరఖాస్తుదారుకు ఎఫ్ఐఆర్ తొలి ప్రతిని అందజేస్తున్న సీపీ ఆనంద్

గోల్కొండ: నగరంలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కొత్త ఠాణాలను ఏర్పాటు చేసినట్లు సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఇటీవల కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఇక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ తొలి ప్రతిని ఫిర్యాదుదారుకు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. నగరంలో నేరగాళ్ల పాలిట పోలీసులు సింహస్వప్నంలా మారారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూనే.. నేర నియంత్రణలోనూ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను నగర పోలీసులు దేశంలోనే రికార్డు స్థాయిలో రికవరీ చేశారన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ తదితరులున్నారు.

దర్యాప్తు ముమ్మరం

- అగ్ని ప్రమాద ఘటనపై లోతుగా విచారణ
- అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు..
- నమూనాలను సేకరించిన నాగ్‌పూర్ బృందం

సాక్షి,హైదరాబాద్: చారిత్రక చార్మినార్ సాక్షిగా హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్ హౌజ్ వద్ద ఆదివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఫోరెన్సిక్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక విభాగాలకు చెందిన అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. విచారణలో భాగంగా వారిని సహకరించాలని కోరుతున్నారు. చార్మినార్ పోలీసుల అభ్యర్థన మేరకు ఇప్పటికే నగర ఫోరెన్సిక్ క్లూస్ విభాగాలకు చెందిన నిపుణుల బృందం గుల్జార్ హౌజ్ వద్ద జరిగిన ఘటన స్థలాన్ని సందర్శించి అవసరమైన నమూనాలను సేకరించారు.

నమూనాల సేకరణ

విచారణలో భాగంగా బుధవారం నాగ్‌పూర్‌నకు చెందిన అగ్నిమాపక విభాగం నిపుణుల బృందం ఘటన స్థలాన్ని సందర్శించింది. అగ్ని ప్రమాదానికి గురైన భవనంలోకి వెళ్లి అవసరమైన నమూనాలను సేకరించింది. భవనంలో ఎన్ని గదులు ఉన్నాయి.. ఎక్కడెక్కడ ఏసీలు ఉన్నాయి.. మృతుల కుటుంబ సభ్యులు ఏయే గదుల్లో ఉన్నారు.. ఎంత మంది ఉన్నారు..? ఘటన జరగకముందు పరిస్థితులతో పాటు అగ్ని ప్రమాదం సంభవించిన అనంతర పరిస్థితులపై ఆరా తీసింది. పొగతో పాటు మంటల వేడికి బీటలువారిన భవనం పైకప్పులు, పగుళ్లుపట్టిన గోడలను నాగ్‌పూర్ అగ్నిమాపక నిపుణుల బృందం పరిశీలించింది.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు..

అగ్ని ప్రమాద ఘటనపై ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణ నిమిత్తం ఉన్నత స్థాయి ఉన్నతాధికారుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ తదితర ఉన్నతాధికారులు విచారణ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఉన్నత స్థాయి విచారణ ద్వారా తెలుసుకోవడంతో పాటు మునుముందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రభుత్వం విచారణ కొనసాగిస్తోంది. నాగ్‌పూర్ బృందం పరిశీలనలో వెలుగు చూసిన అంశాలతో కూడిన రిపోర్టును త్వరలో సంబంధిత ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, అధికారులు

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రేవంత్ సర్కార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక ఉచిత హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలల గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో హామీలు నెరవేర్చలేదన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మితో పాటు, తులం బంగారం అందజేస్తామన్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరికీ బంగారం అందలేదని గుర్తుచేశారు. కేవలం ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా వాగ్దానాలు ప్రకటించారని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ వాణి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంపు

వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త ఎస్‌జీ మహదేవప్ప



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మొయినాబాద్: రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎస్‌జీ మహదేవప్ప అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పర్యావరణ రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి భూమిలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ఖర్చులు తగ్గించాలని.. నీటి వృథాను అరికట్టేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను అవలంబించాలన్నారు. పర్యావరణ రక్షణకు చెట్లను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేష్, మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓ సునీల్‌కుమార్, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

చెరువులోపడి వృద్ధురాలి మృతి

షాద్‌నగర్‌రూరల్: అనారోగ్యంతో ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పిన వృద్ధురాలు చెరువులో శవమై తేలిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామశివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కిషన్‌నగర్ గ్రామానికి చెందిన వడ్డెఎల్లమ్మ(70) అనారోగ్యంగా ఉందని ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పి ఉదయం ఇంట్లో నుంచి బయలుదేరింది. గ్రామశివారులోని చెరువులో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వృద్ధురాలి చెప్పులు, రూ.600లు చెరువు గట్టుపైనే ఉన్నాయి. చెరువు వద్దకు స్నానానికి వెళ్లి జారిపడి మృతి చెందిందా.. లేక ఆత్మహత్య చేసుకుందా అనే అనుమానాలు వ్యక్తమవుతుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్వరలో మాన్సూన్ టీమ్స్!

వర్షాకాల ఇబ్బందుల పరిష్కారానికి..

- టెండర్లు ఆహ్వానిస్తున్న జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాల సమస్యలను ఎదుర్కొనే సన్నద్ధతలో భాగంగా జీహెచ్ఎంసీ దాదాపు 400 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను ఏర్పాటు చేయనుంది. వచ్చే జూన్ ఆరంభం నుంచి వర్షాకాలం ముగిసేంత వరకు (అక్టోబర్ నెలాఖరు వరకు) ఈ టీమ్స్ పని చేస్తాయి. ఇందుకుగాను దాదాపు రూ. 45 కోట్లు ఖర్చు చేయనున్నారు. వర్షాకాలంలో వానొస్తే రోడ్లు, కాలనీలు నీటి నిల్వలతో చెరువులుగా మారడం, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు పొంగిపొర్లడం తెలిసిందే. ఈ సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఈ టీమ్స్ పనిచేస్తాయి. నగరంలో ప్రతియేటా నీరునిల్వ ఉండే ప్రాంతాలు జీహెచ్ఎంసీలోని సంబంధిత అధికారులకు తెలుసు. అలాంటి ప్రాంతాల్లో స్టాటిక్ టీమ్స్ నియమిస్తారు. నిల్చిపోయే నీటిని ఎప్పటికప్పుడు టీమ్స్‌లోని కార్మికులు తోడి పోస్తారు. వీటితో పాటు వాహనాలతో కూడిన మొబైల్ టీమ్స్ కూడా ఉంటాయి. ఇవి కాలనీలు, బస్తీలతో పాటు ఎక్కడ నీరు నిలిచినా వెళ్లి తొలగిస్తాయి. జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌కు అందే ఫిర్యాదులను బట్టి ఆయా ప్రాంతాలకు వెళ్లి నిల్వ నీటిని తొలగిస్తాయి. షిఫ్టులవారీగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ పని చేస్తాయి. ఈ టీమ్స్‌లోని కార్మికులు నీరు తోడిపోసేందుకు, అవసరమైన ప్రాంతాల్లో స్వల్ప మరమ్మతులు చేసేందుకు యంత్ర సామగ్రిని కలిగి ఉంటారు. వీటి ఏర్పాటు కోసం జోన్లలో సర్కిళ్ల వారీగా సంబంధిత ఈఈలు టెండర్లు పిలుస్తున్నారు.

మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్ ఇలా..

ఒక్కో టీమ్‌కు వాహనం, నలుగురు కార్మికులు, నీటిని తోడి పోసేందుకు పరికరాలు ఉంటాయి. షిఫ్టుల వారీగా ఈ టీమ్స్ పనిచేస్తాయి. ఇలాంటి టీమ్స్ దాదాపు 150 వరకు ఉంటాయి.

జీహెచ్ఎంసీ అని తెలిసేలా..

మొబైల్ ఎమర్జెన్సీ టీమ్స్ వాహనాలకు జీహెచ్ఎంసీ లోగోతో బోర్డు పెట్టాలని, టీమ్‌కు నేతృత్వం వహించే వారి ఫోన్ నంబర్లను అన్ని పోలీస్‌స్టేషన్లకు అందజేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇటీవల జరిగిన వర్షాకాల సన్నద్ధత సమావేశంలో ఆదేశించారు. వర్షాల సమయంలో ఇంజినీర్లు సైతం 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. అంతేకాకుండా వాటర్ లాగింగ్ సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించిన కమిషనర్ బేగంపేటలో నీటి నిల్వకు కారణాన్ని గుర్తించి పై నుంచి వచ్చే నీటిని నియంత్రించేందుకు స్లూయిస్ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించడం తెలిసిందే.

స్టాటిక్ టీమ్స్

నీరు అధికంగా నిలిచిపోయి రోడ్లు చెరువులుగా మారే ప్రాంతాల్లో, క్యాచ్‌పిట్ల వద్ద ఒకరు లేదా ఇద్దరు కార్మికులతో ఈ టీమ్స్ ఉంటాయి. వీటిల్లోని కార్మికులు నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తోడిపోస్తారు.ఇలాంటి టీమ్స్ దాదాపు 250 ఉంటాయి.

నేటి నుంచి ఇంటర్ 'సప్లిమెంటరీ'

చేవెళ్ల: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి జరగనున్నాయని, అన్ని కేంద్రాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని చేవెళ్ల ఎస్ఐ వనం విరీష చెప్పారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. స్ఫూర్తి కళాశాల సమీపంలో నాదర్‌గుల్‌లో నివాసం ఉండే మడను అవినాష్(20) అనే యువకుడు కొన్నేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన చేపట్టాలి

సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ రమేశ్



ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రమేశ్

కొత్తూరు: మారుతున్న విద్యావ్యవస్థ, పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏఎస్‌పీడీ) రమేశ్ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సీఆర్పీ, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి, శ్రద్ధ పెంచేందుకు ఉపాధ్యాయులు బోధనలో సాంకేతికతను వినియోగించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడిబాటలో భాగంగా బడిఈడు పిల్లను బడుల్లో చేర్పించేలా ఉపాధ్యాయులకు స్థానికులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్, ఉపాధ్యాయులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


కరోనాపై ఆందోళన వద్దు

ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్–1

- వేగంగా వ్యాప్తి.. ప్రమాదం తక్కువ
- ఎక్కడా ఒక్క పాజిటివ్ కేసు నమోదు కాలేదు
- అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణుల సూచన



గాంధీ ఆస్పత్రిలో 30 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు



గాంధీ ఆస్పత్రి : మరోసారి వేగంగా వ్యాపిస్తున్న కరోనాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వైద్యనిపుణులు సూచించారు. రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 30 పడకలతో కోవిడ్ వార్డును ఏర్పాటు చేశామని, కరోనాను సమర్థంగా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. థర్డ్‌వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్– 1 ప్రస్తుతం వ్యాప్తిలో ఉందని, కానీ.. ఇది ప్రమాదకారి కాదన్నారు.

దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాండమిక్, ఎపిడమిక్, ఎండమిక్ మూడు స్టేజ్‌లు ఉంటాయని, కరోనా వైరస్ వీటిలో చివరిదైన ఎండమిక్ స్టేజ్‌లో ఉందన్నారు. రెస్పిరేటరీ వైరస్‌లలో కోవిడ్ పాజిటివ్ కేసులు 60శాతం ఉన్నాయని ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) తాజాగా విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. కోవిడ్ వైరస్‌ను ప్రాణాంతకమైన మహమ్మారిలా చూసే పరిస్థితి లేదని, జలుబు, దగ్గు వంటి సాధారణ రుగ్మతగానే వచ్చిపోతుందని, గతంలో వేసుకున్న కోవిడ్ వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోయినప్పటికీ, ప్రజల్లో హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చిందన్నారు.

చిన్నారుల్లో నమోదు కావడం లేదు



ప్రస్తుతం సింగపూర్, హాంకాంగ్‌తో పాటు మన దేశంలోని మహారాష్ట్రలో వ్యాప్తిలో ఉన్న ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్–1 వైరస్ చిన్నారుల్లో నమోదు కావడంలేదు. ఒమిక్రాన్ బీఏ.2.86 నుంచి రూపాంతరం చెందిన జేఎన్–1లో మూడు సబ్ వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, పీఏ.2.1, ఎక్స్‌ఈసీ.25.1లు ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నట్లు ఐసీఎంఆర్ గుర్తించింది. మహారాష్ట్రలో జేఎన్–1 వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. కానీ ఇది ప్రమాదకారి కాదు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. మాస్కులు ధరించి అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది.

– ప్రొఫెసర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ మెడిసిన్

సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధం



కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో సర్వం సిద్ధం చేశాం. ఓపీ భవనం రెండో అంతస్తులో 30 పడకలతో కోవిడ్ వార్డు ఏర్పాటు చేశాం. నిష్ణాతులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. యాంటివైరల్ డ్రగ్స్, వైరాలజీ ల్యాబ్, రీఏజెంట్స్ (ద్రావకాలు) ఇతర మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. తెలంగాణ ప్రజలు హెర్డ్ ఇమ్యూనిటీ సాధించారు. కరోనా లక్షణాలైన జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి రుగ్మతలకు గురైనవారు స్వీయ సంరక్షణ పాటిస్తూ, వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి. జన సమూహ ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.

– ప్రొఫెసర్ సునీల్‌కుమార్, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్

అదుపుతప్పి కారు బోల్తా



సమీపంలో బోల్తా పడిన కారు

మొయినాబాద్: అతివేగంతో వెళ్లిన కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం జేబీఐటీ కళాశాల వైపు నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న క్వాలిస్ కారు అతివేగంతో వెళ్తూ అమ్డాపూర్ గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. అతనికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహ (ఫైల్)

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పీఎస్ పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం నర్సింహ(50) ఈ నెల 7న పని కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా జాడలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

లయన్స్ క్లబ్ సౌజన్యంతో సైకిళ్ల అందజేత



సైకిళ్లు అందజేస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి తదితరులు

కందుకూరు: లయన్స్ క్లబ్ సౌజన్యంతో దెబ్బడగూడకు చెందిన పేద విద్యార్థినులు సురక్షిత, ప్రవీణకు బుధవారం ఈ–సైకిళ్లు అందజేశారు. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా బాలికలకు అందించి ఒక్కో సైకిల్ ధర రూ.10 వేలు ఉంటుందని కోశాధికారి కె.వెంకటేశ్వర్లుగుప్తా తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి తాళ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



కళేబరం వద్ద బాధిత రైతు

కడ్తాల్: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని పుల్లేర్‌బోడ్‌తండాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. తండాకు చెందిన నేనావత్ గోపాల్‌నాయక్‌కు ఉన్న పాడి ఆవు మేత మేసుకుంటూ పక్క పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. దీంతో విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడినట్లు బాధిత రైతు తెలిపారు. ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

చార్మినార్: రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఉగ్రవాద వ్యతిరేక దినంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం చార్మినార్ వద్ద బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నిరంజన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలతో మన దేశాన్ని ప్రగతిపథంలో నిలిపారని చెప్పారు. కార్యక్రమంలో సద్భావన యాత్ర స్మారక సమితి సభ్యులు జి.ఆనంద్, జి.కన్నయ్య లాల్, రాఘవేందర్, బహదూర్‌పుర, చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కర్షకుల కష్టం వర్షార్పణం!



యాచారం కొనుగోలు కేంద్రంలో కవర్లు కప్పిన ధాన్యం కుప్పలు

యాచారం: నిబంధనల సాకు, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. వెరసి కర్షకుల కష్టం వర్షార్పణం అవుతోంది. పండించిన ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రోజులు గడుస్తున్నా.. కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో రైతులు వడ్ల కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాలకు వడ్లను కాపాడుకునేందుకు భగీరథ యత్నం చేస్తున్నారు. యాచారం మండలం మల్కీజ్‌గూడ, యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని యాచారం కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. అధికారులు సేకరించకపోవడంతో బుధవారం కురిసిన వర్షానికి తడిసిపోయింది. ధాన్యంపై కవర్లు కప్పినప్పటికీ.. భూమి పదునుతో ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి వానలు కురిస్తే ధాన్యంపై ఆశలు వదులుకోవాల్సిందేనని వాపోతున్నారు.

విద్యుత్ అధికారులు నంబర్ల మార్పు

తుక్కుగూడ: కందుకూరు డివిజన్ విద్యుత్ శాఖలో పని చేస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు ప్రభుత్వం మార్చినట్లు డీఈ గోపాలకృష్ణ బుధవారం తెలిపారు.

డీఈ కందుకూరు	8712470200
ఏడీఈ మామిడిపల్లి	8712470201
ఏడీఈ ఆమనగల్లు	8712470204
ఏఈ కందుకూరు	8712470229
ఏఈ మహేశ్వరం	8712470239
ఏఈ బాలాపూర్	8712470268
ఏఈ పహాడీషరీఫ్	8712470253
ఏఈ కడ్తాల్	8712470207
ఏఈ ఆమనగల్లు	8712470205
ఏఈ తలకొండపల్లి	8712470224
ఏఈ మాడ్గుల	8712470254
ఏఓ కందుకూరు	8712470206